జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 9 | జూన్ | 2026 • పేజీలు : 7



## వివాదాలు లేని భూ పరిపాలనా వ్యవస్థను తీసుకురావాలి

- నక్ష పైలట్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలి : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు
- నక్ష సర్వే పనులు పురోగతిలో ఉన్నాయి : జిల్లా కలెక్టర్ అంకిత్



2 లో...

- పెసా చట్టానికి పాతర... గిరిజన హక్కులకు గొడ్డలిపెట్టు
- బినామీల దందాతో కోట్లాది ప్రభుత్వ ఆదాయానికి గండి
- గోదారమ్మ గర్భాన్ని తోడేస్తూ... "నన్ను కాపాడండి" అంటూ ఘోషిస్తున్న గోదావరి



2 లో..

# ఇసుకాసురుల... కబంధ హస్తాల్లో ఏజెన్సీ..!

ఒకవైపు గిరిజనుల హక్కులు కాలరాయబడుతున్నాయి. మరోవైపు గోదారమ్మ గర్భాన్ని యంత్రాలతో చీల్చి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులో పెసా చట్టాన్ని తుంగలో తొక్కి, గిరిజన సొసైటీల పేరుతో బినామీ కాంట్రాక్టర్లు సాగిస్తున్న ఇసుక దందా పర్యావరణాన్ని, ప్రభుత్వ ఆదాయాన్ని, గిరిజనుల జీవనాధారాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గోదావరి గర్భాన్ని లోతుల వరకు తోడేస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతుండటంతో "నన్ను కాపాడండి" అంటూ గోదారమ్మ ఘోషిస్తున్నా పాలకులకు, అధికారులకు వినిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• మణుగూరు, ప్రజాజ్యోతి

## వృద్ధుడి కుటుంబానికి కుల బహిష్కరణ..!



- మూడు తండాలో చోటుచేసుకున్న దారుణ ఘటన
- చేతబడి కుటుంబం అంటూ సామాజిక వెలివేత
- ఊరిలో ఎవరూ మాట్లాడటం లేదంటూ చిన్నారుల ఆవేదన
- బాధిత కుటుంబానికి చెందిన స్థలాన్ని ఆక్రమించి కిరాణా దుకాణం ఏర్పాటు చేసిన వైనం
- న్యాయం చేయాలని వేడుకుంటున్న మూడ్ వస్త్రం, కాంతి

**టేకులపల్లి, జూన్08, ప్రజాజ్యోతి:** సమాజం ఆధునికత వైపు పరుగులు తీస్తున్నప్పటికీ గిరిజన తండాల్లో ఇప్పటికీ కుల బహిష్కరణ, మూఢ నమ్మకాల పేరుతో సామాజిక వెలివేత వంటి అమానుష ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం టేకులపల్లి గ్రామపంచాయతీ

మిగతా 3 లో...

## మావోయిస్టుల డంప్ స్వాధీనం




**చర్ల , జూన్ 08 (ప్రజాజ్యోతి):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్లలో భాగంగా సీఆర్పీఎఫ్ 199వ బెటాలియన్ కీలక విజయం సాధించింది. పిడియా ప్రాంతంలోని హర్రా/అర్రా గ్రామ అటవీ ప్రాంతంలో నిర్వహించిన గాలింపు చర్యల్లో మూడు ఐఈడీలు, రెండు నక్సల్ డంప్‌లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 199వ బెటాలియన్ అందించిన నిఘా సమాచారం మేరకు

మిగతా 2 లో...

# భద్రత కరువైన కొయ్యూరు బడి...!

- కూలిన ప్రహరీ గోడలు..
- పెచ్చులు ఊడుతున్న వైనం..
- నీరు కారుతున్న పైకప్పు..
- దృష్టిసారించని అధికారులు..




**చర్ల, జూన్ 08:(ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడం, "బడిబాట" వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో చర్ల మండలం కొయ్యూరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన పాఠశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొయ్యూరులోని పాఠశాల భవనం చాలా సంవత్సరాలుగా సరైన మరమ్మతులకు

మిగతా 3 లో...


# వివాదాలు లేని భూ పరిపాలనా వ్యవస్థను తీసుకురావాలి



**మణుగూరు, జూన్ 08 (ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలో వివాదాలు లేని పారదర్శక భూపరిపాలనా వ్యవస్థను తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం డిజిటల్ సర్వే కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు తెలిపారు. భూముల రీ-సర్వే, పట్టణ భూముల హద్దుల గుర్తింపు (నక్ష) కార్యక్రమాల పురోగతిపై రామకృష్ణరావు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్ష పైలట్ ప్రాజెక్టులకు ఎంపికైన జిల్లాల్లో సర్వే మరియు రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో రోవర్ పరికరాల ద్వారా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఆస్తులకు ఖచ్చితమైన సర్వే చేపట్టి, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నక్ష పైలట్ ప్రాజెక్టు కింద మణుగూరు మున్సిపాలిటీ ఎంపికైందని తెలిపారు. ప్రాజెక్టు అమలులో భాగంగా సర్వే మరియు రెవెన్యూ శాఖల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మున్సిపల్ శాఖ ద్వారా ఆర్ఓఆర్ నమోదు ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 15 రెవెన్యూ వార్డులు ఉండగా, వాటిని 97 బ్లాక్‌లుగా విభజించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 7,524 ఆస్తులను గుర్తించామని, వాటిలో 5,064 ఆస్తుల సర్వే పూర్తయిందని చెప్పారు. అలాగే 2,074 ఆస్తులకు సంబంధించిన డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. నక్ష ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు పారదర్శకమైన భూ రికార్డులను అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఏడి. సర్వే శ్రీనివాస్, మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల డంప్ స్వాధీనం





(మొదటి పేజీ తరువాయి...)

కమాండెంట్ ఆనంద్ కుమార్ మార్గదర్శకత్వంలో, సెకండ్-ఇన్-కమాండ్ కుమార్ నీరజ్ పర్యవేక్షణలో, కంపెనీ కమాండర్ కె.బి. పాండా నేతృత్వంలోని ఎఫ్/199 కంపెనీ సిబ్బంది దట్టమైన అటవీ ప్రాంతంలో విస్తృతంగా గాలింపు చేపట్టారు. గాలింపు సందర్భంగా భద్రతా సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నక్సల్స్ భద్రతా బలగాలకు హాని కలిగించేందుకు దాచిపెట్టిన పేలుడు పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో ఐఈడీల తయారీకి ఉపయోగించే గన్‌పౌడర్, జెలటిన్ స్టిక్స్, వాణిజ్య డిటోనేటర్లు తదితర పేలుడు పదార్థాలతో పాటు 15 వైద్య సామగ్రి వస్తువులు ఉన్నాయి. మొత్తం 21 వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హర్రా/అర్రా గ్రామం పరిసర ప్రాంతాలు గతంలో నక్సలైట్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేవని అధికారులు తెలిపారు. అయితే సీఆర్పీఎఫ్ 199వ బెటాలియన్ నిరంతర ఆపరేషన్ల ఫలితంగా ఆ ప్రాంతంలో నక్సల్స్ ప్రభావం గణనీయంగా తగ్గి, స్థానిక ప్రజల్లో భద్రతా భావన పెరిగిందన్నారు. ఈ ఆపరేషన్‌లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు అని పౌరుల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రాంతీయ అభివృద్ధి కోసం నిఘా ఆధారిత నక్సల్ వ్యతిరేక చర్యలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని సీఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు.

- పెసా చట్టానికి పాతర... గిరిజన హక్కులకు గొడ్డలిపెట్టు
- బినామీల దందాతో కోట్లాది ప్రభుత్వ ఆదాయానికి గండి
- గోదారమ్మ గర్భాన్ని తోడేస్తూ... "నన్ను కాపాడండి" అంటూ ఘోషిస్తున్న గోదావరి



# ఇసుకాసురుల... కబంధ హస్తాల్లో ఏజెన్సీ...!

**ఒకవైపు గిరిజనుల హక్కులు కాలరాయబడుతున్నాయి. మరోవైపు గోదారమ్మ గర్భాన్ని యంత్రాలతో చీల్చి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులో పెసా చట్టాన్ని తుంగలో తొక్కి, గిరిజన సొసైటీల పేరుతో బినామీ కాంట్రాక్టర్లు సాగిస్తున్న ఇసుక దందా పర్యావరణాన్ని, ప్రభుత్వ ఆదాయాన్ని, గిరిజనుల జీవనాధారాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గోదావరి గర్భాన్ని లోతుల వరకు తోడేస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతుండటంతో "నన్ను కాపాడండి" అంటూ గోదారమ్మ ఘోషిస్తున్నా పాలకులకు, అధికారులకు వినిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

● మణుగూరు, ప్రజాజ్యోతి

మణుగూరు మండల పరిధిలోని చిన రాయిగూడెం, అన్నారం, పద్మగూడెం, గుండ్లసింగారం, తిర్లాపురం, రామానుజవరం, సాంబాయిగూడెం, దమ్మక్కపేట తదితర గ్రామాల పరిధిలో సీతమ్మసాగర్ పూడికతీత పేరుతో భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. రికార్డుల ప్రకారం ఇవన్నీ గిరిజన సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ యంత్రాలు, టిప్పర్లు, ప్రొక్లెన్లు, జేసీబీలు వినియోగిస్తూ ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ››› రికార్డుల్లో గిరిజన సొసైటీలు... వాస్తవంలో బినామీల పెత్తనం

మండలంలో డజనుకు పైగా ఇసుక ర్యాంపులు గిరిజన సొసైటీల పేరుతో కొనసాగుతున్నాయి. అయితే వాటి నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, యంత్ర సామగ్రి అన్నీ గిరిజనేతర కాంట్రాక్టర్ల ఆధీనంలో ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. గిరిజనులకు స్వల్ప మొత్తాలు చెల్లించి, వారి పేర్లను మాత్రమే వినియోగిస్తున్నారని పలువురు మేధావులు విమర్శిస్తున్నారు. కోట్ల రూపాయల లాభాలు మాత్రం బినామీ వ్యవస్థ ద్వారా కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయని అంటున్నారు.


### ››› పెసా చట్టానికి పాతర

ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో గ్రామసభలకే అత్యున్నత అధికారం కల్పిస్తూ 1996లో కేంద్ర ప్రభుత్వం పెసా చట్టాన్ని తీసుకొచ్చింది. గ్రామసభ అనుమతి లేకుండా సహజ వనరుల వినియోగం జరగరాదు. కానీ మణుగూరు ప్రాంతంలో గ్రామసభల తీర్మానాలను పక్కనబెట్టి ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. చట్టం ఉన్నా అమలు లేకపోవడంతో గిరిజనుల స్వపరిపాలన హక్కులు ప్రశ్నార్థకంగా మారాయని గిరిజన సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

గిరిజన హక్కుల గొంతుకోత గ్రామసభల్లో వ్యతిరేక తీర్మానాలు చేసినా పట్టించుకోకపోవడం, స్థానికుల అభ్యంతరాలను నిర్లక్ష్యం చేయడం, గిరిజనుల పేర్లతోనే వారి సంపదను దోచుకోవడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. "జల్-జంగల్-జమీన్" హక్కులతో పాటు ఇప్పుడు ఇసుకపై హక్కులను కూడా కోల్పోతున్నామని ఆదివాసీలు వాపోతున్నారు. తమ కళ్ల ముందే తమ ప్రాంత సంపద తరలిపోతుంటే నిస్సహాయంగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీ గండి, రోజుకు వందల సంఖ్యలో లారీల ద్వారా ఇసుక తరలిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వానికి రావాల్సిన సీనరేజ్, రాయల్టీ, డీఎంఎఫ్, జీఎస్టీ ఆదాయంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డీసిల్టింగ్ పేరుతో జరుగుతున్న కార్యకలాపాల్లో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ అవసరమని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### ››› గోదారమ్మ ఘోష వినిపించదా...?

ఇసుక తవ్వకాలతో గోదావరి నదీ గర్భం లోతుగా మారుతోంది. భూగర్భ జలాలు తగ్గిపోతుండగా, నది తీర ప్రాంతాల్లో బోర్లు ఎండిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. జలచరాల ఆవాసాలు నాశనం కావడంతో పాటు నదీ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. నది మధ్యలో రహదారులు నిర్మించడం వల్ల వరద ప్రవాహానికి ఆటంకం ఏర్పడి భవిష్యత్తులో వరద ముప్పు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఒకప్పుడు గలగలా పారుతూ లక్షలాది మందికి జీవనాధారంగా నిలిచిన గోదారమ్మ నేడు ఇసుకాసురుల దోపిడీకి బలై గర్భాన్ని కోల్పోతూ గగ్గోలు పెడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "నా ఒడిని దోచుకుంటున్నారు... నా గర్భాన్ని ఖాళీ చేస్తున్నారు... నన్ను కాపాడండి" అంటూ గోదారమ్మ ఘోషిస్తున్నా వినేవారే లేరా అని ప్రశ్నిస్తున్నారు.



### ››› చర్యలు ఎప్పుడూ...?

ఇప్పటికైనా ప్రభుత్వం, టీఎస్ఎండీసీ, సంబంధిత శాఖల అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని, బినామీ వ్యవస్థను నిర్మూలించాలని, పెసా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గోదావరిని కాపాడి, గిరిజన హక్కులను పరిరక్షించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతమంతటా ఒక్కటే ప్రశ్న వినిపిస్తోంది... "గోదారమ్మ ఘోష పాలకులకు వినిపించదా..?".

# భద్రత కరువైన కొయ్యూరు బడి...!










(మొదటి పేజీ తరువాయి...)

నోచుకోలేదు. కాలక్రమేణా భవనం బలహీనపడటంతో పైకప్పు పలు చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం కురిసినా తరగతి గదుల్లోకి నీరు కారుతూ ఉండటంతో విద్యార్థులు పాఠాలు వినేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని వర్షం సమయంలో పుస్తకాలు, విద్యా సామగ్రి తడిసిపోతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పైభాగంలోని పెచ్చులు తరచూ ఊడిపడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల సిమెంట్ ముక్కలు కింద పడగా, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. అయితే పాఠశాల సమయాల్లో పెచ్చులు ఊడిపడితే విద్యార్థులకు తీవ్ర గాయాలు సంభవించే అవకాశం ఉందని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పైకప్పు స్లాబ్ కూడా బలహీనంగా మారిందని, అధికారులు వెంటనే సాంకేతిక నిపుణులతో తనిఖీ నిర్వహించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.మరోవైపు పాఠశాలకు చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వల్ల భద్రత పూర్తిగా ప్రశ్నార్థకంగా మారింది. గేటు కూడా లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి ఎవరైనా సులభంగా ప్రవేశించే పరిస్థితి నెలకొంది అని కొంతమంది వ్యక్తులు పాఠశాల ప్రాంగణాన్ని తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పశువులు కూడా తరచూ ఆవరణలోకి రావడం వల్ల పరిశుభ్రత దెబ్బతింటోందని విద్యార్థులకు అనుకూల వాతావరణం లేకుండా పోతోందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు కనిపించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యాశాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుండగా మరోవైపు గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించడంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. పాఠశాలల్లో భద్రత, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, గేట్లు, సురక్షిత భవనాలు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉంటేనే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కొయ్యూరు ప్రాథమిక పాఠశాల భవనానికి తక్షణమే మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త ప్రహరీ గోడ, గేటు నిర్మించాలని, పైకప్పు మరమ్మతులు చేసి పెచ్చులు ఊడిపడకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగే వరకు ఎదురుచూడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

››› హెడ్మాస్టర్ తాటి శ్రీనివాస్

**వివరణ:**

ఇదే విషయమై కొయ్యూరు ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ తాటి శ్రీనివాస్ ను వివరణ కోరగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ కూలిపోవడం, గేటు లేకపోవడంతో భద్రత లేకుండా పోయిందని ఒకపక్క శిథిలావస్థలో ఉన్న పాఠశాల స్లాబ్ పెచ్చులు అప్పుడప్పుడు ఊడి పడుతున్నాయని వర్షాకాలంలో నీరు కూడా పైనుంచి కారుతున్నాయని పలుమార్లు అధికారులు దృష్టికి ఇదే విషయాన్ని తీసుకువెళ్లాలని స్పెషల్ గ్రాంట్లు వచ్చిన వెంటనే మరమ్మతులు చేయిస్తామని అధికారులు అన్నారని ప్రస్తుతం 22 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ ఉన్నారని ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు పెరిగే అవకాశం ఉన్నదని కావున అధికారులు కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలోని వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రహరీ గోడ, గేటును ఏర్పాటు చేసి పాఠశాలకు భద్రత కల్పించాలని విద్యార్థులకు భయంలేని విద్యను అందించేలాగా చొరవ చూపించాలని అన్నారు.

# వృద్ధుడి కుటుంబానికి కుల బహిష్కరణ..!

(మొదటి పేజీ తరువాయి...)

పరిధిలోని మూడు తండాలో ఓ గిరిజన వృద్ధుడి కుటుంబం కుల బహిష్కరణకు గురైన ఘటన తీవ్రచర్చనీయాంశంగా మారింది. తండాకు చెందిన 65 ఏళ్ల వ్యవసాయదారుడు మూడ్ వస్త్రం, ఆయన భార్య కాంతి కుటుంబాన్ని తండా పెద్దలు సామాజికంగా వెలివేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. గ్రామం లో ప్రజలు వారితో ఎవరూ మాట్లాడకూడదని చివరికి వారి ఇంటికి వెళ్లకూడదని తండాలో జరిగే శుభకార్యాలు కార్యక్రమాలకు ఆ వృద్ధుడి కుటుంబాన్ని పిలవకూడదని గ్రామ పెద్దలుగా చెప్పుకునే వారు ఆంక్షలు విధించారని వాపోతున్నారు.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల వారి పిన్ని మూడ్ హీమిలి మృతి చెందగా సంప్రదాయం ప్రకారం తండా వాసుల నుంచి డబ్బులు, బియ్యం సేకరించిన తండా పెద్దలు తమ కుటుంబాన్ని మాత్రం పూర్తిగా విస్మరించారని తెలిపారు. తమ కుటుంబ సభ్యురాలు మరణించిన నేపథ్యంలో కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా వ్యవహరించిన గ్రామస్తుల తీరును ప్రశ్నించగా నాయక్, కార్బారీల ఆదేశాల మేరకే ఇలా చేస్తున్నామని గ్రామస్తులు చెప్పడం ఆశ్చర్యాన్ని గురిచేసిందన్నారు. అంతేకాకుండా తమ కుటుంబాన్ని చేతబడి కుటుంబంగా చిత్రీకరిస్తూ తండా నుంచి వెళ్లిపోవాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలతో పాటు గ్రామస్తులు కొంతమంది తమకు నోటికొచ్చినట్లు దూషిస్తూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని తండాలో ఉండే హక్కు కూడా లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని బాధిత వృద్ధుడి కుటుంబంఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో తమ సొంత స్థలంలో నాయక్, అతని కుమారుడు అక్రమంగా కిరాణా దుకాణం ఏర్పాటు చేశారని దానిని ఖాళీ చేయాలని కోరితే దాడికి యత్నిస్తూ చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. వాళ్లు చెప్పినట్లు వినకపోతే తండాలో బతకనివ్వమని హెచ్చరిస్తున్నారని మూడ్ వస్త్రం వాపోయారు.

### ››› చిన్నారులపై కుల బహిష్కరణ ప్రభావం

ఈ వ్యవహారంతో కుటుంబంలోని చిన్నారులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. ‘మా మనవళ్లు, మనవరాళ్లతో ఊరిలోని పిల్లలు మాట్లాడటం లేదని గ్రామంలో ఆడుకోవడానికి అర్హత లేదంటూ హుకుం జరిచేసారని ఆవేదన చెందుతున్నారు. మాతో ఎందుకు ఎవరూ మాట్లాడటం లేదు..? అని పిల్లలు అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామంటూ వారి బాధ చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### ››› అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

సామాజికంగా తమ కుటుంబాన్ని వెలివేసి, భూమిని ఆక్రమించి ప్రాణభయానికి గురిచేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అదేవిదంగా చేతబడి ఆరోపణల పేరుతో వేధింపులు, కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర వర్తించే చట్టాల కింద చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# కలివేరులో ప్రజాపాలన గ్రామసభ




**చర్ల, జూన్ 08: (ప్రజా జ్యోతి ):** ప్రజాపాలన ప్రగతి పథం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పది రోజుల గ్రామసభల సందర్భంగా చర్ల మండలం కలివేరు గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మ కమిటీ చైర్మన్ ఇందుల గోపాల బుచ్చిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల ప్రధాన ఉద్దేశ్యం గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమని తెలిపారు. తాగునీరు, విద్యుత్, పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మురికి నీటి నిల్వలను నివారించాలని సూచించారు.మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారంలో రెండు రోజులు డ్రైడేగా పాటించాలని కోరారు. తాగునీటిని మరగబెట్టి చల్లార్చిన తర్వాత మాత్రమే వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత ప్రభుత్వ శాఖల సిబ్బందిని సంప్రదించి తగిన సూచనలు, సహాయం పొందాలని గ్రామస్తులకు తెలిపారు.అనంతరం రైతులను ఉద్దేశించి ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలు, విత్తనాల పంపిణీ వివరాలను వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, హౌసింగ్ ఏఈ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, వీఆర్ఏలు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి





• ఎంపీఓ శ్రీనివాసరావు

**పినపాక, జూన్ 9 (ప్రజాజ్యోతి)** పినపాక మండలం బోటిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక సర్పంచ్ బాపనమ్మ అధ్యక్షతన గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీఓ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ తాతారావు హాజరై గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు తదితర ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ తాతారావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో గ్రామ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య... బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు




**పినపాక,జూన్ 9(ప్రజాజ్యోతి)** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఉప్పాక ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ సుభద్ర తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉప్పాక గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రవికుమార్, అనూష,నాగమణి, లావణ్య గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కృష్ణసాగర్ లో ప్రజాసమస్యలు పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ కు సర్పంచ్, ఉపసర్పంచ్ వినతి



**బూర్గంపహాడ్, జూన్ 8 (ప్రజా జ్యోతి):** మండలానికి మారుమూలన ఉన్న కృష్ణసాగర్ పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ తాటి వాణి ఉపసర్పంచ్ భూక్యా మోహనరావుతో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ అంకిత్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కృష్ణసాగర్ పంచాయతీలో అభివృద్ధి పనులు మంజూరు చేయించాలని, ప్రధానంగా తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం స్వీకరించిన కలెక్టర్ సమస్యలపై అధికారులతో చర్చించి ప్రజాసమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఏ డి ఏ



**టేకులపల్లి, జూన్ 08, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలము లోని కోక్య తండా,టేకులపల్లి గ్రామంలోని విత్తన దుకాణాలను ఇల్లందు వ్యవసాయ సహాయ సంచాలకులు జి.లాల్ చాంద్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.దుకాణాల్లో నిల్వ ఉంచిన విత్తనాల బిల్లులు, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డును తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.అధికారిక లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద నుంచే రైతులు విత్తనాలు, ఎరువులను రైతులు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. డీలర్లు రైతులకు తప్పనిసరిగా బిల్ ఇవ్వాలని, ఆ బిల్‌పై లాట్ నంబర్ కూడా తప్పకుండా పేర్కొనాలని తెలిపారు. సరైన లేబులింగ్, ప్యాకేజింగ్ ,లాట్ నంబర్ ఉన్న విత్తనాలనే అమ్మాలని పేర్కొన్నారు.


# వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గం

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాల్గవ మహాసభలలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య



**పినపాక,జూన్ 9(ప్రజాజ్యోతి)** వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గం అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాల్గవ మహాసభలు పినపాక మండలం ఈ బయ్యారం గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామంలోని స్థానిక వేదికలో జరిగిన ఈ మహాసభలకు సంఘం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలే మార్గమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, పెరుగుతున్న ధరలు, కూలీలకు సరైన వేతనాలు అందకపోవడం వంటి సమస్యలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఉపాధి హామీ పథకంలో పని దినాలను పెంచడంతో పాటు కూలీలకు చెల్లించే వేతనాలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.మహాసభలో సంఘం భవిష్యత్ కార్యాచరణ, సభ్యత్వ విస్తరణ, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాలపై పలు తీర్మానాలు ఆమోదించారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల ఐక్యతను పెంపొందించి వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దుబ్బ గోవర్ధన్, మండల కమిటీ సభ్యులు మడివి రమేష్, దడిగల వెంకన్న, కల్తి వెంకటేశ్వర్లు, మండల నాయకులు, గ్రామ శాఖ ప్రతినిధులు, వ్యవసాయ కార్మికులు, మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యకు పరిష్కారం





**చర్ల, జూన్ 08:(ప్రజా జ్యోతి ):** చర్ల మండల పరిధిలోని గన్నవరం కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యకు స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో పరిష్కారం లభించింది.పాఠశాలలో ఉన్న బోర్‌వెల్ మోటార్ గత నెలలో చెడిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) మోటార్ ను మరమ్మతులు చేయించారు. అయితే మోటార్‌ను తిరిగి బోర్‌వెల్‌లోకి దించే సమయంలో చెట్ల వేర్లు అధికంగా పెరగడంతో మోటార్ లోపలికి వెళ్లకపోవడం వల్ల సమస్య కొనసాగింది. విషయాన్ని తెలుసుకున్న ఉప్పరిగూడెం గ్రామ సర్పంచ్ వెంటనే స్పందించి సంబంధిత సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బోర్‌వెల్ పనులు నిర్వహించి మోటార్‌ను విజయవంతంగా అమర్చడంతో తాగునీటి సరఫరా పునరుద్ధరించబడింది.ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యను త్వరితగతిన పరిష్కరించిన సర్పంచ్‌కు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు మళ్లీ తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

# కార్మిక లోకానికి కొమురయ్య సేవలు ఆదర్శప్రాయం

- సింగరేణి హెడ్ఆఫీస్ ఎదుట కొమురయ్య కాంస్య విగ్రహ పునఃప్రతిష్ఠ
- ఆయన ఆశయ సాధనకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలి : ఎమ్మెల్యే కూనంనేని




**కొత్తగూడెం, జూన్ 8 ( ప్రజాజ్యోతి )** సింగరేణి కార్మిక లోకానికి మనుబోతుల కొమురయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధుడు మనుబోతుల కొమురయ్య (యూనియన్ కొమురయ్య) కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొగ్గు గనుల్లో ఎనిమిది గంటల పనివిధానాన్ని సాధించిన ఘనత కొమురయ్యకే దక్కుతుందని కొనియాడారు. నాటి రోజుల్లో విస్తృతంగా కొనసాగిన కాంట్రాక్టు విధానాన్ని తన పోరాటాలతో వెనక్కు నెట్టారని గుర్తుచేశారు. భూగర్భ గనుల్లో ప్రమాదకర పరిస్థితుల్లో పని చేసే మహిళా కార్మికులకు సర్ఫేస్ ఉద్యోగాలు కల్పించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. పది సంవత్సరాల లోపు పిల్లలతో పనులు చేయించుకునే అమానవీయ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి సింగరేణిలో బాల కార్మిక వ్యవస్థకు స్వస్తి పలికించిన మహానేత కొమురయ్య అని పేర్కొన్నారు. రేగే, జాదవ్ కమిటీల సిఫార్సులు, ముజుందాస్, దాస్‌గుప్తా, రఘునాథ్‌రెడ్డి అవార్డుల ద్వారా కార్మికులకు అనేక ప్రయోజనాలు చేకూరేలా కృషి చేశారని చెప్పారు. జాతీయ వేతన ఒప్పందాలు, చారిత్రాత్మక సమ్మెలు, ఉద్యమాల ద్వారా సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులు సాధించి పెట్టిన ఘనత కొమురయ్యదేనని స్పష్టం చేశారు. కొత్తగూడెం ప్రాంతంలోని సంఘటిత, అసంఘటిత కార్మికులను ఏకం చేసి హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలిచిన నాయకుడిగా కొమురయ్య పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కొమురయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని కార్మిక హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు కొరిమి రాజ్‌కుమార్, మిర్యాల రంగయ్య, వంగ వెంకట్, జి వీరాస్వామి, ఎస్‌వి రమణమూర్తి, వి మల్లికార్జున్‌రావు, కె సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, మద్ది ఎల్లయ్య, వైవి రావు, ముస్కె నమ్మయ్య, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, ఎస్‌కే ఫహీమ్‌తో పాటు కొమురయ్య కుటుంబ సభ్యులు శైలజ, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# హరితహారంతో పచ్చదన సందేశం





- గిరిజన విద్యార్థుల హిందీ నైపుణ్యాలపై ప్రత్యేక చర్చ
- పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి సందర్శన

**పాల్వంచ, జూన్ 8, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచలో నిర్వహిస్తున్న ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషల్ సైన్సెస్ డీన్, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, పచ్చదనం ప్రాధాన్యతను చాటి చెబుతూ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి, సెస్స్–ఐసీఎస్ఎస్ఆర్ పోస్ట్ డాక్టరల్ ఫెలో డా. వి. మల్లికార్జున్ నాయక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య సమస్యలను ఎదుర్కోవాలంటే మొక్కల పెంపకం, హరితహారం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా గిరిజన విద్యార్థుల హిందీ భాషా నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక చర్చ నిర్వహించారు. జాతీయ స్థాయిలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు, పోటీ పరీక్షల్లో విజయానికి హిందీ భాషా పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుందని ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు హిందీతో పాటు ఇతర భాషల్లోనూ ప్రావీణ్యం సాధించడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. డా. వి. మల్లికార్జున్ నాయక్ మాట్లాడుతూ భాషా నైపుణ్యాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, విద్యా పురోగతికి, ఉపాధి అవకాశాల సాధనకు దోహదపడతాయని తెలిపారు. గిరిజన విద్యార్థుల్లో భాషా సామర్థ్యాల పెంపుదలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. కళాశాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల సమగ్ర వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ డా. టి. అరుణ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ డా. జె. మాధవి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

- యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందజేత




**కొత్తగూడెం, జూన్ 8 ( ప్రజాజ్యోతి )** కార్మికుల శ్రమతో మనుగడ సాగిస్తున్న సింగరేణి సంస్థలో కార్మికులను కట్టుబానిసలుగా చూడటం సరికాదని సమస్యలు పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. రుద్రంపూర్ లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో రెండు రోజులుగా జరిగిన యూనియన్ జాతీయ కౌన్సిల్ సమావేశాల ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంగారు బాతులా ఉపయోగించుకుంటున్నాయని సంస్థ అభివృద్ధి కంటే ఆదాయ వనరులను మాత్రమే వినియోగిస్తున్నాయని విమర్శించారు. సంస్థలో ఆధునిక యంత్రాల వినియోగం పేరుతో కార్మికుల సంఖ్యను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణి నష్టాలపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్ల ఆదాయం, లాభాలు, వ్యయాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. సింగరేణి ప్రాజెక్టులకు కార్మిక నేతలు కొమరయ్య, శేషగిరిరావు, విఠల్‌రావు పేర్లు పెట్టాలని కోరారు. మారుపేర్ల సమస్య పరిష్కారం, సొంతింటి రుణాలు, డిపెండెంట్లకు ఉద్యోగాలు, డిపార్ట్‌మెంట్ పోస్టుల భర్తీ, సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం సహా 30 డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ మేరకు సోమవారం యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందజేస్తున్నామని న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే రాష్ట్రంలో గతంలో జరిగిన ఆర్టీసీ సమ్మె కంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మిర్యాల రంగయ్య, కె. సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, మద్ది ఎల్లయ్య, వైవి రావు, ముస్కె నమ్మయ్య, వంగా వెంకట్, జి. వీరస్వామితో పాటు వివిధ ఏరియాల బ్రాంచ్ కార్యదర్శులు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రీ–ప్రైమరీ విద్య అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అమలు చేయాలి

- అంగన్‌వాడీ కేంద్రాల మూసివేతకు ప్రభుత్వ కుట్ర
- కలెక్టర్, డీడబ్ల్యూవో, డీఈవోలకు సీఐటీయూ వినతి



**కొత్తగూడెం, జూన్ 8 ( ప్రజాజ్యోతి )** ప్రీ–ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అమలు చేయాలని ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ) అమలును నిలిపివేయాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల మూసివేతకు దారితీసే చర్యలను వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ డీడబ్ల్యూవో, జిల్లా డీఈవోలకు వినతిపత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. బ్రహ్మచారి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకమ్మ మాట్లాడుతూ ఐసీడీఎస్ వ్యవస్థను బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రీ–ప్రైమరీ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడం వల్ల ఐసీడీఎస్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసే కుట్రలను పోరాటాల ద్వారా తిప్పికొడతామని హెచ్చరించారు. గ్రామాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకే పంపేలా ఇంటింటి ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 4 వేలకుపైగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసే లక్ష్యంతోనే ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. ప్రీ–ప్రైమరీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే క్రమంలో చేపట్టిన నియామక ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రీ–ప్రైమరీ విద్యను కొనసాగించాలని కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఐసీడీఎస్‌కు నిధులు పెంచి బలోపేతం చేయాలని ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని ఎన్నికల హామీ మేరకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేసి పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం. విజయశీల, జిల్లా నాయకులు పాయం రాధాకుమారి, రాజ్యలక్ష్మి, నాయకురాళ్లు జె. స్వరూప, పి. అంజమ్మ, ఎన్. తిరుమల, స్వరూప, రాధాకుమారి, నాగమణి, అనసూయ, కృష్ణవేణి, సునీత, దయావతి, చంద్రకళ, సౌజన్య, హైమావతి కుమారి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో చింతోల గుంపు గ్రామంలో బోర్ బావి నిర్మాణం



**ఆళ్ళపల్లి, జూన్8(ప్రజాజ్యోతి)** ఆళ్ళపల్లి మండల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చింతోలగుంపు గ్రామ ప్రజల మంచినీటి సమస్యకు పరిష్కారం లభించింది. పినపాక నియోజకవర్గ శాసనసభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లు సహకారంతో, ఆళ్ళపల్లి పంచాయతీ సర్పంచ్ వాసం సుష్మిత ప్రత్యేక కృషితో సోమవారం గ్రామంలో బోర్ బావిని నిర్మించారు. దీర్ఘకాలికంగా ఉన్న తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు ఈ బోర్ బావిని ఏర్పాటు చేసినట్లు స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళపల్లి కాంగ్రెస్ పార్టీ కో–ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, 9వ వార్డు సభ్యులు బూరుగడ్డ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పానుగంటి మంగ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. తమ గ్రామానికి మంచినీటి వసతి కల్పించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా

- పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం



**చుంచుపల్లి , జూన్ 8 ( ప్రజాజ్యోతి )** చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణ లక్ష్యంగా ఈ టీకాను 2011 ఏప్రిల్ 1 నుంచి 2012 జూన్ 1 మధ్య జన్మించిన 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు టీకా ప్రాధాన్యతను వివరించి బాలికల ఆరోగ్య రక్షణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివకృష్ణ, సీహెచ్‌వో మహేందర్, ఏఎన్‌ఎంలు ఎం.ఎస్. లక్ష్మి, పి. అరుణ తదితరులు పాల్గొన్నారు.

## కెఓసి నూతన పిఓ ని సన్మానించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్



**టేకులపల్లి, జూన్08, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓసీలో నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్ బింగి మాధవరావు కి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి, కెఓసిలో బొగ్గు ఉత్పత్తి ఎక్కువగ చేసి, బొగ్గు లోడింగ్ పెంచాలని, అంతర్గత రోడ్లను త్వరిత గతిన బాగు చేయాలనీ జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, కోల్ కాంట్రాక్టర్ వడియాల చిట్టి బాబు కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డివిజన్ టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షులు నెలవెల్లి నరసింహ రావు, ఉపఅధ్యక్షులు & ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, కార్యదర్శి, అరవ వెంకటేష్, అశోక్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రదోష వేళ నందీశ్వర స్వామివారికి అభిషేకం

- 13న రుద్రహోమం
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృప పొందాలి : ఈఓ రజనీకుమారి



**పాల్వంచ, జూన్ 8, ప్రజాజ్యోతి:** శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 12వ తేదీన శ్రీ నందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి రజనీకుమారి తెలిపారు. మాఘమాస త్రయోదశి సందర్భంగా జూన్ 12, శుక్రవారం ప్రదోషకాలంలో సాయంత్రం 5.30 గంటలకు శ్రీ నందీశ్వర స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, అనంతరం నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి. ఈ పూజల్లో పాల్గొన్న భక్తులకు భగవంతుని అనుగ్రహంతో కష్టాలు, దారిద్ర్యం, రుణబాధలు, గ్రహదోషాలు తొలగి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలుగుతాయని పేర్కొన్నారు. అలాగే మాసశివరాత్రిని పురస్కరించుకుని జూన్ 13, శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మహిమాన్వితమైన "రుద్రహోమం"ను వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రుద్రహోమంలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,516/– చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవచ్చన్నారు. హోమంలో పాల్గొన్న దంపతులకు శేషవస్త్ర ప్రసాదం అందజేయబడుతుందని తెలిపారు. ప్రత్యక్షంగా హాజరు కాలేని భక్తుల పేర్లపై కూడా సంకల్పం చేసి హోమం నిర్వహించబడుతుందని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం 6303408458 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కావాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి రజనీకుమారి కోరారు.

# ఆనందఖని హైస్కూల్‌కు వన్నె తెచ్చిన ఆణిముత్యాలు

- పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థినులు



**కొత్తగూడెం, జూన్ 8 ( ప్రజాజ్యోతి )** ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా ప్రతిభలో ఏమాత్రం వెనుకబడి లేరని ఆనందఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నిరూపించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చారు. పాఠశాలలో మామిడి ప్రత్యూష 545 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, పల్లపు శ్రీలేఖ 537 మార్కులతో ద్వితీయ స్థానం దక్కించుకుంది. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివించిన తల్లిదండ్రుల కృషికి తగిన ఫలితం లభించిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థినుల విజయంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈఓ ప్రభుదయాల్ ఇద్దరు విద్యార్థినులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించడం ఇతర విద్యార్థులకు ఆదర్శమని అన్నారు. విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# నవభారత్ కార్మిక యూనియన్ సమస్యలపై చర్చించాలి

- డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరిక




**పాల్వంచ, జూన్ 8, ప్రజాజ్యోతి:** నవభారత్ కార్మిక యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నవభారత్ మెయిన్ గేట్ ముందు కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, సీనియర్ నాయకుడు ఎంవీ అప్పారావు మాట్లాడుతూ నవభారత్ కర్మాగారంలోని పలు విభాగాల్లో 5 నుంచి 15 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనాల అమలు, పనిభద్రత, గ్రాట్యుటీ వంటి ప్రాథమిక హక్కులు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడం, శాశ్వత పనులకూ కాంట్రాక్ట్ కార్మికులతోనే పని చేయించడం, సమాన పనికి సమాన వేతనం అమలు కాకపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నవభారత్‌లో మహిళా ఉద్యోగుల నియామకాలు లేకపోవడం కూడా ఆందోళనకరమని పేర్కొన్నారు. ఫెర్రో అల్లాయిస్ విభాగంలో 12/3 ఒప్పందం ప్రకారం 55 మంది కార్మికులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 47 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. చిన్నచిన్న కారణాలతో కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటినీ ఇప్పటికే పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లభించలేదని, నవభారత్ కార్మిక యూనియన్‌ను గుర్తించి కార్మిక సమస్యలపై చర్చలు జరపాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ధర్నాలతోనే ఆగబోమని, అవసరమైతే సమ్మెకు కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. ధర్నా సందర్భంగా యాజమాన్య ప్రతినిధులుగా వచ్చిన హెచ్‌ఆర్ విభాగం అధికారులు వాస్తవాలను వక్రీకరిస్తూ మాట్లాడారని ఆరోపిస్తూ కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కోల్ ప్లాంట్‌లో పదేళ్లుగా పనిచేసిన సుంకనపల్లి ప్రవీణ్ (40) పనివల్లే క్యాన్సర్ బారినపడి ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ యాజమాన్యం ఎలాంటి ఆర్థిక సహాయం అందించలేదని నాయకులు పేర్కొన్నారు. కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ ఏరియాకు చెందిన ప్రవీణ్ కుటుంబంలో భార్య సువర్ణ, కుమార్తెలు ప్రసన్న, శ్రేష్ఠ ఉన్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరెందరో కార్మికులు ఉన్నారని, కర్మాగారంలో జరిగే ప్రమాదాలకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవి కుమార్, సీపీఎం పట్టణ కార్యదర్శి పి. తులసిరాం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె. సత్య, వి. సత్యవాణి, వింజా రాములు, ఎస్‌కే నిరంజన్, బి. కాంతి, నవభారత్ కార్మిక యూనియన్ నాయకులు గోపాల్, సుధీర్, డి. సురేష్, ఎ. యాకోబు, గుర్రం రాములు, ఎం.డి. యాకోబు, కవిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

- గ్రామాల్లో బడిబాట నిర్వహణ



**టేకులపల్లి, జూన్08, ప్రజాజ్యోతి:** ఐదేళ్లు దాటిన పిల్ల లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలంగాణ దివ్యాంగ, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భానోత్ లక్ష్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు బడి బయట ఉన్న పిల్లల వివరాలు అంగన్ వాడీ కేంద్రాల్లో అప్ డేట్ చేయాలని సూచించారు.ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు,పదో తరగతిలో సాధించిన ఉత్తమ ఫలితాలను తెలియ జేయాలన్నారు. ఇంటింటా సందర్శన , ఇంటింటికీ తిరిగి బడి వయస్సున్న పిల్లలను గుర్తిస్తున్నారు.సదుపాయాల గురించి వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత యూనిఫాంలు, పుస్తకాలు,ఇతర సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. స్కూల్ మానేసిన విద్యార్థులను, బడి ముఖం చూడని చిన్నారులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక ప్రేరణ చేస్తున్నారు. తమ పిల్లలను ప్రైవేటుకు పంపించకుండా సర్కారు పాఠశాలల్లో చేర్పించాలని, ప్రైవేటు పాఠశాలల్లో వేల రూపాయలు ఫీజులు చెల్లించినప్పటికి నాణ్యమైన విద్యా అందక తల్లిదండ్రులు ఒత్తిడికి గురికాకూడదని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఇంగ్లీషు మీడియం విద్య అందుబాటులో వుందని , నాణ్యమైన విద్యా ప్రభుత్వ పాఠశాల ద్వార మాత్రమె సాధ్యమని తెలియజేస్తూ ఇంటింటా ఊరువాడ తిరుగుతూ బాడిఈడు పిల్లలందరినీ సర్కారు పాఠశాలల్లో చెర్పించే విదంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామప్రజలు రమేష్,శ్రీను, నరసింహ,ఈరు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని చిన్నారుల వినతి



**ములకలపల్లి, జూన్ 08, (ప్రజాజ్యోతి):** ములకలపల్లి గ్రామపంచాయతీ లో సోమవారం నిర్వహించిన గ్రామసభలో గొల్లగూడెం గ్రామానికి చెందిన చిల్డ్రన్స్ పార్లమెంట్ సభ్యులు ప్రజా సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందజేశారు. గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, అలాగే భగత్‌సింగ్ నగర్‌లో అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని కోరారు. చిన్నారులు గ్రామంలో విద్యా, బాలల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో చిల్డ్రన్స్ పార్లమెంట్ సభ్యులు వశిష్ట సూర్య, మోక్షజ్ఞ, అశ్విత, శోభ, త్రిష, మోజేష్ తదితరులు పాల్గొన్నారు

# జాగిలంతో తనిఖీ

- మత్తు పదార్థాలు ఉంటే జాగిలాలకు చిక్కినట్టే
- గంజాయి పై ప్రజలకు అవగాహన కార్యక్రమం



**టేకులపల్లి,జూన్08,ప్రజాజ్యోతి:** మత్తు పదార్థాలను కనిపెట్టేందుకు జాగిలాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు సూచనల మేరకు గంజాయి,మాదకద్రవ్యాలు, డ్రగ్స్ ను కనిపెట్టేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలంతో టేకులపల్లి మండలంలోని పాత గంజాయి నేరస్తుల ఇళ్లల్లో, నిర్మాణుష్య ప్రదేశాలలో టేకులపల్లి ఎస్ఐ ఆలకుంట రాజేందర్ ఆధ్వర్యంలో జాగిలంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులకు గంజాయిపై అవగాహన కల్పించే కార్యక్రమంలో టేకులపల్లి ఎస్ ఐ రాజేందర్ మాట్లాడుతూ యువత గంజాయి మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దు అని.. వాటికి ఆకర్షితులు అయి ఆరోగ్యాలను ,జీవితాలు నాశనం చేసుకోవొద్దు అని చెప్పారు.అంతేకాకుండా చదువు పై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. ఎటువంటి చెడు అలవాట్లు లేకుండా తమ తల్లీ తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలియచేశారు.గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి విషయం గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి వంటి మాదకద్రవ్యాలను త్రాగిన కలిగి ఉన్న చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఈ తనిఖీలలో టేకులపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- హెచ్‌పీవీ వ్యాక్సిన్ నుంచి టీబీ నివారణ వరకు విస్తృత అవగాహన
- గ్రామ ఆరోగ్య కమిటీ సమావేశంలో సర్పంచ్ రమాదేవి పిలుపు



**దమ్మపేట,జూన్.08 (ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార కమిటీ (వీహెచ్ఎస్ఎన్‌సీ) సమావేశంలో గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామంలో త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార పరిస్థితులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పగడాల రమాదేవి మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణ చర్యలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ బాలికల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 14 సంవత్సరాలు నిండిన, 15 సంవత్సరాల లోపు బాలికలకు ఈ వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుందని వివరించారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సుఖప్రసవానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. మొదటి కాన్పు తర్వాత రెండో గర్భధారణకు కనీసం మూడు సంవత్సరాల వ్యవధి ఉండటం తల్లి, శిశువు ఆరోగ్యానికి మేలు చేస్తుందని వివరించారు. కుటుంబ నియంత్రణలో భాగంగా కాపర్-టి (లూప్) వినియోగం సురక్షితమైన, దీర్ఘకాలిక గర్భ నిరోధక పద్ధతి అని తెలియజేశారు. టీబీ వ్యాధి గాలి ద్వారా వ్యాపించే ప్రమాదకర అంటువ్యాధి అని, రెండు వారాలకు మించి దగ్గు ఉన్నవారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవీ, మధుమేహం, పోషకాహార లోపం ఉన్నవారికి టీబీ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని అవగాహన కల్పించారు.వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, చెత్తాచెదారం తొలగించడం, పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సమావేశంలో పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, పసుమర్తి కుసుమాంబ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా దారా మల్లిఖార్జునరావు

- దమ్మపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం
- సామాజిక సేవలకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి బాధ్యతలు
- సమాజ అభ్యున్నతికి మరింత కృషి చేయాలని ఆకాంక్ష



**దమ్మపేట,జూన్.08 (ప్రజాజ్యోతి):** దమ్మపేటకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, మాజీ వైస్ ఎంపీపీ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ దారా మల్లికార్జునరావుకు మరో కీలక గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఆయన నియమితులవడంతో దమ్మపేట మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగానే ఈ బాధ్యతలు లభించాయని సంఘ నాయకులు పేర్కొన్నారు.సంఘం అధ్యక్షులు పసుమర్తి రామభద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దారా మల్లికార్జునరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పసుమర్తి రామభద్రరావు మాట్లాడుతూ సామాజిక సేవను ధ్యేయంగా తీసుకుని ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న దారా మల్లికార్జునరావుకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు దక్కడం దమ్మపేట మండలానికి గర్వకారణమన్నారు. ఆయన అనుభవం, సేవాభావం రాష్ట్రవ్యాప్తంగా సమాజానికి మరింత ఉపయోగపడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దారా మల్లికార్జునరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతి, యువత సాధికారత, విద్యా ప్రోత్సాహం, సేవా కార్యక్రమాల విస్తరణ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గాన్ని కలుపుకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు కృషిచేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో అత్తులూరి పోసి వెంకట సీతారామరాజు, మండవల్లి సురేష్, చారుగుండ్ల ప్రదీప్, దొడ్డా వినోద్ కుమార్ తదితర ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొని దారా మల్లికార్జునరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**దమ్మపేట,జూన్.08 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని రంగవారి గూడెం గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం దమ్మపేట ఎస్సై రాజేష్ తమ సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు డబ్బులను పందెంగా పెట్టుకుని పేకాట ఆడుతుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,530 నగదు, మూడు మోటార్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించి 11 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుల్లో ఒకరు పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## రసాభాసగా ప్రజాపాలన గ్రామసభలు

- ప్రజా సమస్యలపై అధికారుల ను నిలదీసిన ప్రజలు






**ములకలపల్లి, జూన్ 08 (ప్రజాజ్యోతి):** ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని తాళ్లపాయ, రామచంద్రపురం, పూసుగూడెం, కమలాపురం గ్రామపంచాయతీలలో సోమవారం అధికారులు నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. ములకలపల్లి గ్రామపంచాయతీలో జరిగిన గ్రామసభ రసభాసగా మారింది. పంచాయితీ లో నెలకొని ఉన్న ప్రజా సమస్యలపై గ్రామస్తులు అధికారులను నిలదీశారు. మంగపేట పీహెచ్‌సీలో వైద్యుడు లేకపోవడం, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, మట్టి తోలకాల అనుమతులపై ప్రశ్నించారు. వెంటనే వైద్యుడిని నియమించాలని గ్రామస్థులు డిమాండ్ చేయగా సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన మట్టి కోసం దరఖాస్తు చేస్తే అనుమతులు ఇస్తామని తెలిపారు. చెరువుల్లో అక్రమ మట్టి తోలకాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని టీఆర్ ఎస్ నాయకుడు కొండవీటి చంద్రశేఖర్ కోరారు. గ్రామ పంచాయతీ ఖర్చుల వివరాలను జూన్ 23న జరిగే తదుపరి గ్రామసభలో వెల్లడిస్తామని ఎంపీడీవో రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొరస చంద్రలేఖ, ఉపసర్పంచ్ పువ్వాల లలితారావు, ఎమ్మార్వో భాగ్యలక్షి , మిషన్ భగీరథ వరప్రసాద్, అధికారులు, వార్డు సభ్యులు, నాయకులు బత్తుల అంజి, ఎండి జహీరుద్దీన్, నరాటీ రమేష్, అనుముల సాయి పాల్గొన్నారు.

## పాలకుర్తి ప్రసాద్ వర్ధంతిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి





**ములకలపల్లి, జూన్ 08, (ప్రజాజ్యోతి):** మండలంలోని పొగళ్లపల్లి గ్రామంలో సోమవారం తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పాలకుర్తి ప్రసాద్ ద్వితీయ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు పాల్గొని పాలకుర్తి ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పాలకుర్తి ప్రసాద్ సేవలను, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని వారికి ఓదార్పు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైటి రాజేష్, కొమ్మురాజు శ్రీను, బద్రి కృష్ణ, పురేటి నర్సింహారావు, మడకం చిరుమప్ప, పాలకుర్తి రత్నభూషణం, శేఖర్, సూర్యప్రకాశ్, సోరోజ్ కుమార్, హర్షిత్, మనోజ్, బతం అన్వేష్, జీవన్, చల్ల గణేష్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.